# నీ బాటలోని అడుగులు నావి...

*(కిందటి సంచిక తరువాయి)*

నీ ఉత్తరం చదివాక చాలా ఆలోచించాను. ఏ ఆడపిల్లా తనంతట తాను వట్టి పుణ్యానికి వైవాహిక జీవితం పాడు చేసుకోవాలనుకోదు. అసలు అంత నరకం సృష్టించేంత, అనుమానం కలిగించేంత తీవ్రస్థాయిలో భ్రమర మనసు పాడవడానికి సరైన కారణం తెలుసుకున్నావా? నువ్వేమిటో నాకు తెలునని రాశావు. ఐ నో యు జస్ట్ యాజ్ ఎ ఫ్రెండ్. నాతో గౌరవంగా ఉంటావు గనక, మర్యాదగా మాట్లాడతావు గనక, ఆత్మీయతాభిమానాలతో కూడిన స్నేహం గనక నువ్వు మంచివాడివని అనుకుంటాను.

నువ్వు నాతో ప్రవర్తించే తీరును బట్టి నిన్ను నేను జడ్జ్ చేయగలుగుతాను. కానీ, నేను నీ మనసులోకి దూరి ఓ గూఢచారిలా నీ దొంగ వేషాలన్నీ కనిపెట్టను గదా! ఆ అవసరం భ్రమరకెందుకు కల్పించావు.

అమ్మాయిలకి ఐక్యూ ఎక్కువ, ఇలాంటి విషయాల్లో తప్పక. భార్యాభర్తల మధ్య అనుమానం రాకుండానే ఉండాలి. వచ్చినా అది మొగ్గ దశలోనే రాలిపోవాలి. దానికి పరస్పర అవగాహన ఎంతో అవసరం. నీ మటుకు నీవు జంటిల్మన్ అనుకుంటే సరా? నువ్వు నువ్వనుకుంటున్నంత జంటిల్మన్‌వి కావని హద్దులు మీరిన నీ ఉత్తరమే చెబుతోంది. అవునా?

మిగతా విషయాలన్నీ పదిలేసి ఈ ఒక్క విషయం మీద దృష్టిని కేంద్రీకరించి ఆత్మవిమర్శ చేసుకో. జరిగింది మీ ఇరువురి పరంగా సరైనదే అనుకుంటే సరే. లేకపోతే వెళ్ళి భ్రమరకి క్షమాపణ చెప్పి లొంగిపో. ఇంతలోకి నువ్వేం తగ్గిపోవు. లేదా ప్రస్తుత వాస్తవమే సత్యస్థితి అనుకుంటే నీ ఇష్టం. 'ప్రపంచంలోకి వచ్చినందుకు బతికే తీరాలి. జీవితం విషం అయితే తాగే తీరాలి.' కొటేషన్ నాది కాదులే ఉర్దూ కవి షకీల్ బదాయనిది. నీకు అర్థం అయితే చాలు.

నిజమే. మనసు లేని చోట మనువు దుర్భరమే. సామరస్యం కుదరనప్పుడు స్వారస్యం ఉండదు. జీవితం ఏ ఒక్కరి కోసమో కానపుడు, ఆ అవకాశం లేనపుడు దాన్ని బాధించే హక్కు కూడా ఉండదు. ఎవరి బతుకులు వాళ్ళు బతకడం ఉత్తమం. మంచి అమ్మాయిని చూసి జీవితం పంచుకో. ఇందు, భ్రమరల గురించి ముందే తనకి చెప్పడం మర్చిపోకు. అమ్మాయిలు అబద్ధాలాడే వాళ్ళను క్షమించరు. జాగ్రత్త!

నీ వంటి భావుకులు, అనురాగ హృదయులు జీవితాన్ని లాలించి, ప్రేమించి, పాలించాలి. నీ ఉనికికి ఊపిరి అయిన నీ శరీరాన్ని బాధించే హక్కు నీకు లేదు. కౌశిక్ ఇపుడు చిన్నవాడు. రేపు వాడే అర్థం చేసుకుంటాడు. మళ్ళీ పెళ్ళి అని భూతద్దం లోంచి చూడకు. తప్పు, త్యాగం- ఈ పదాలన్నీ మర్చిపో. వ్యక్తిగతమైన మృదుభావనలు ఎవరికి వారే ఆస్వాదించదగినవి. మనసుని దారి తప్పనివ్వకు. నీకోసం బతుకు. మొండితనం మనిషికి బావుండదు. మనసుకు అసలు బావుండదు. బడాయిలు పోకు.

నిర్ణయాలు తీసుకోవడం అంత తేలిక కాదు ప్రణవ్. మనసు హద్దులు దాటి వచ్చిన అంతరంగం మథనానికి ముందు క్షీరసాగరం లాంటిది. దాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినపుడు ఆ మథనంలోంచి ఎన్నెన్ని పుట్టుకొస్తాయో? వాటికి నీవెంతవరకు న్యాయం చేకూర్చగలవో ఆలోచించు. భయం లేదు. తప్పక ఓ అద్భుతాన్ని సాధిస్తావు. మన స్నేహం సాక్షిగా నీకు సంపూర్ణ జీవన సౌఖ్యం కలగాలని కోరుకుంటున్నాను.

నా నుండి ఉత్తరాలు రాయడం నేర్చుకున్నానన్నావు. థ్యాంక్స్. ఒక్కోసారి మన చుట్టూ ఎంతమంది ఉన్నా, మనం ఎంత ఊపిరి సలపని పని ఒత్తిడిలో ఉన్నా పావురాయి రెక్కతో చెంప నిమిరినట్లు ఓ గాలితెమ్మెర అలవోకగా తనువుని స్పృశించి వెళ్ళినప్పటి అనుభూతిని అక్షరాలు ఇవ్వగలిగినపుడు ఆ ఇది ఎంతో బావుంటుంది. అవునా!

ఉత్తరాలు రాయడం నాకెంతో ఇష్టం. కానీ, మన స్పందనకు సరైన ప్రతిస్పందన రాకపోతే అక్షరాల్లో పొదగాల్సిన ఆలోచనలన్నీ ఆవిరైపోతాయి. ఓ మంచి ఉత్తరం చదివాకా క్షణం కుదురుగా నిలబడనివ్వని స్నేహవీచికలు మిత్రలోకం మెట్లు ఎక్కిస్తుంటే... కాగితం, కలం పట్టుకుని కాలాన్ని మరిచి కబుర్లు చెప్పుకుంటే ఎంత రిలాక్సింగ్‌గా ఉంటుందో తెలుసా? చినుకులు పడుతున్నా చల్లని సాయంకాలం మల్లె పందిరి కింద కూర్చుని, మాల అల్లుతూ హాయైన అలనాటి ఘంటసాల పాట వింటున్నట్లన్నమాట.

బాపూ బొమ్మలు చూసినపుడల్లా సరిగ్గా ఇలాంటి భావనే కలుగుతుంది. నిజంగా ప్రణవ్, ఒక్కసారి

> తెలుగుదనం మా
> మనసుల్ని కలిపింది.
> పరిచయం ప్రణయ
> మైంది. తన చొరవే
> నేను ముందడుగు
> వేసేలా చేసింది.

బాపూతో మాట్లాడాలి, మితభాషి అయిన అతను ఎక్కువగా సంభాషించక నిరాశ పరచినా ఫర్వాలేదు. మౌనరాగాలతో రేఖల్లో విశ్వసౌందర్యాన్ని సృష్టించే అతని చేతివేళ్ళ చైతన్య కదలికలు చూడాలి. చిత్రకారులెంత అదృష్టవంతులు! తమ ఊహలకు తామే ఊపిరులూదగలరు కదూ?

కాసేపు నా గొంతు వినాలని అన్నావు. మొన్న ఫోన్లో మాట్లాడానుగా. 'టైం విల్ సాల్వ్ ఎవ్విరీథింగ్' లాంటి వాక్యాలతో మండే నీ గుండెను సేద దీర్చడం అసంభవమని నాకు తెలుసు. కానీ, చిత్రంగా సంగతులు మన గుప్పిట్లోంచి జారిపోతున్నపుడు పట్టుకోలేని పరిస్థితుల్లో మంచి గతమున కొంచెమౌనోయ్ మిత్రమా! బంగారు భవిష్యత్తు నీ ముందుంది అని మాత్రం ఊరట నివ్వగలం. హృదయం గాయపడితే ఆ బాధ ఎంత పచ్చిగా ఉంటుందన్నది ఆ హృదయానుభవానికే తెలుస్తుంది. నువ్వొక వ్యక్తివి కావు, సంస్థవి. అందుకే కొందరి జీవితాలు వ్యక్తిగతాలు కావు, అందరివీ. అవ్యక్తభావాలు ఎన్నో ఉంటాయి. వ్యక్తపరచిన వాటి ముందు అవి హిమవన్నగాలే అవుతాయి. వ్యక్తావ్యక్త భావనలే ఏకాంతంలో ఎదను సేదదీర్చేవి. నీ మనసే నీకు తోడు. నీ ఊహే నీ ఊపిరి. ప్రణయ్, నువ్వన్నట్లు మన స్నేహం తరుచ్ఛాయ మాత్రమే!

నీ విషయం ఎవరికీ చెప్పొద్దన్నావు. నువ్వు నాకు స్నేహితుడివి. నీ బాధ నా బాధ కాదూ! ఇంతదాకా ఏదీ దాచలేదు. అవసరం రాలేదు. కానీ, నీ సంగతి శ్రీహరికృ్కాడా చెప్పలేదు. చెప్పకపోయినా ఎక్కడో మాట జారే ప్రమాదం ఉంది. ఆ తర్వాత పశ్చాత్తాపాలు పరువుని కాపాడలేవు. అందుకే చెప్పలేదు. నీమీద ఉన్న మంచి ఇంప్రెషన్ పోగొట్టను. 'రహస్యం దాస్తేనే అది నీకు బానిస. బైట పడిందా అదే నీకు యజమాని.' ఎమర్సన్ మాటలు గుర్తున్నాయా?

ప్రణవ్, నిజానికి జీవితాల గురించి తీర్పు నివ్వడం కష్టం. కలయికలు, విడిపోవడాలు కేవలం భౌతికమైనవి కావు. అనేకానేక మానసిక సంఘర్షణా సంక్లిష్టతల సమాహారం. నువ్వు మళ్ళీ అందరు మగవాళ్ళలా తాజా కన్నె గులాబీ కోసం వెతక్కుండా నీ తోడు, ఆలంబన అవసరమై, మానసికంగా నీకు దగ్గర కాగలిగే అమ్మాయికి నీ చేయి అందించు. అనురాగాన్ని పంచు. సరేనా! అందాకా నీ హృదయాన్ని భావకాలుష్యం నుంచి కాపాడుకో. ఉంటాను. బోల్డంత పని ఉంది. మళ్ళీ ఉత్తరంతో కలుస్తాను.

ఫ్రెండ్లీ యువర్స్
ప్రజ్ఞ

మేరీ ప్యారీ దోస్త్ ప్రజ్ఞా,

ఇవాళ మధ్యాహ్నం శ్వేత కపోతంలా నా టేబుల్ మీద వాలింది నీ లేఖ. ఎంత హృద్యంగా ఉన్నాయి నీ మాటలు! వెన్నెల పల్లకిలా, మంచు సోనలా! సంపెంగ పరిమళంలా! ఎంత మధురంగా ఉన్నాయి నీ అనునయ వాక్యాలు నాకిష్టమైన అజ్మీర్ కలాఖండ్‌లా!

ఆకాశం నిర్మలంగా ఉంది నీలాగే. అది ఎప్పుడు వర్షిస్తుందో తెలీదు నీ స్నేహంలా! ఎప్పుడు ఎండ కాస్తుందో తెలీదు నీ కోపంలా. నీ ఉత్తరం చదివినకొద్దీ మళ్ళీ మళ్ళీ చదవాలనిపించింది ప్రజ్ఞా. ఇదిగో ఇప్పుడే ఇంకోసారి చదివి ఎదురుగా పెట్టుకుని సమాధానం రాస్తున్నా. గాలి నామీది దయతోనో, కోపంతోనో ఎక్కడెక్కడి నుంచో పూల పరిమళం మోసుకొస్తోంది. ఆ పరిమళాల నాఘ్రాణిస్తూ రాస్తున్నా. అంత బాగా అర్థం చేసుకునే నువ్వు నాకున్నందుకు ఐ యాం సో హాపీ! నీకింత అందమైన మనసిచ్చినందుకు దేవుడికి థ్యాంక్స్. నీ నోటి వాక్యాన అంతా సర్దుకున్నాక మనసెరిగిన మగువ దొరికితే నీకు ఎప్పుడూ మరచిపోని మంచి బహుమతి ఇస్తాను. సాధ్యపడుతుందంటావా!


ఆఫ్ సెంచరీకి ఆరేళ్ళు తక్కువున్నా నేను

పెళ్ళికొడుకునైతే అంధరూ నవ్వేరూ! సర్లే నువ్వు పెళ్ళి కూతురి వేటలో ఉండు.

రాత్రి మళ్ళీ నువ్వు నా కల్లోకి వచ్చావు. నిన్నే ఎందుకు కలగనాలి? ఏమో! నీ సమక్షంలో ఆమడ దూరం ఉండే నేను ఊహాల్లో, కలల్లో అంత సాన్నిహిత్యాన్ని ఎలా ఫీలవగలుగుతున్నాను. నువ్వన్నట్లు నేను జంటిల్మన్‌ని కాదా? తుంటరినా? వీర ఆరాధకుడినా? ప్చ్! కలల్ని దోసిళ్ళతో నింపి నీ కడకు తెద్దామనుకున్నా. కానీ, ఏవీ? అదృశ్యమైపోయాయి. ప్రతి నిమిషానికీ సూర్యోదయం, చంద్రోదయం కాదు కదా! ప్రతి రోజూ ఉగాది రాదు కదా! అలాగే నువ్వూనూ.

నీకెలా రాయాలో చెప్పు, ప్రయత్నిస్తాను. ఈ లేఖ ఫ్రెండ్ లాగే రాస్తున్నాను కదూ! నేనంతేలే. మరోలా రాయలేను. అయినా, స్వర్గద్వారం ముందు నిల్చుని గులకరాళ్ళ గురించి ఎలా ఆలోచించగలను! కవితాత్మ, భావుకత ఉన్న నిన్ను పిచ్చిపూలతో ఎలా పూజించేది? హృదయ కమలాల్ని సమర్పించుకోవాలిగాని, నీకు రాసేపటప్పుడు ప్రతి అక్షరం ఓ ముత్యం.

టైటానిక్ సిన్మా చూశావా? ఓ నౌకాభంగాన్ని ఓ సమ్మోహన ప్రణయంతో జతచేయడమే టైటానిక్ టిక్... టిక్. ఆ అమ్మాయి పెయింటింగ్ మనోహరంగా ఉంది కదూ! నేను చిత్రకారుణ్ణయితే ఇంకా బాగా వేసేవాణ్ణి. ఆఁ... ఆఁ... ఉత్తరం మూసెయ్యకు. ఇంకిలా రాయన్లే. ప్రజ్ఞా, నీకు కోపం వచ్చినా బాగుంటుంది. మళ్ళీ క్షణంలోనే మాయం. కోపంగా ఉన్నప్పుడు నిన్ను మరింత రెచ్చగొట్టాలనిపిస్తుంది. మాగ్జిమమ్ కోపం తెప్పిస్తే ఏం చేస్తావ్. సారీ, ట్రాక్ తప్పుతున్నాను కదూ!



చిత్రం: నర్సిం

చిరుకోపం, మాటిమాటికీ వాదన పెట్టుకునే నీ తత్త్వం, వాదనలే నీ ఆత్మవిశ్వాసం నాకు చాలా చాలా ఇష్టం. అందుకే నీకో జీవితకాలపు అభిమానిగా మిగిలి ఉంటాను.

ఇంత బరువైన గతం, పనికిరాని వర్తమానం, అగమ్య భవిష్యత్తు, అయోమయ జీవితం ఎవరికైనా ఉంటుందా? నీ మాటలు వినడానికి ఎంతో బావున్నాయి. కానీ, నేను హీరోను కాను. నాది సినిమా కాదు. జీవితం. అంత తీయని ముగింపు సాధ్యం కాదు ప్రజ్ఞా! నాకేం చెబుతావు. జీవితాన్ని అనుభవించడానికే పుట్టినట్లు, ఎప్పుడు చూసినా సుఖాల శిఖరాల మీద విహరిస్తున్నట్లు ఉంటావు! సర్లే, అవన్నీ మర్చిపో!

చెలీ! నీకో శుభవార్త నిన్ను విసిగించకుండా ఉండడం కోసం కనబడకుండా వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో తెలుసా? మానససరోవరానికి కాదులే! పని మీద ఆరు వారాలు ఫిలడెల్ఫియా వెళ్తున్నాను. రేపే ప్రయాణం. వెళ్ళేముందు ఎయిర్‌పోర్ట్ నుంచి ఫోన్ చేస్తాను. బెస్టాఫ్ లక్ చెబుదువుగాని. అందాకా శలవ్!

నీ నిజమైన (యువర్స్ ట్రూలీ),
ప్రణవ్.

ప్రజ్ఞా, మైడోస్త్!

ఎలా ఉన్నావు? ఇంకో నాలుగు రోజుల్లో తిరుగు ప్రయాణం. ఈ రోజుదాకా వెన్నెలలు కురిపించే నీ లేఖ కోసం నిరీక్షిస్తూనే ఉన్నాను. ఆ ఆశ వదిలేసుకున్నాను. నీవు బేవఫావి. నేనెవర్ని అనుకున్నాను ఓక్షణం. మొన్న ఫోన్లో హైదరాబాద్ రాగానే నీకో రహస్యం చెబుతానన్నాను కదూ! చాలా ఉత్కంఠలో ఉంచానా? అయినా, నీకేంలే. నేనే ఆగలేక రాస్తున్నాను. ఇది నేను వచ్చాకే నీకు అందుతుందనుకో. సముఖాన చెప్పలేక ఈ లేఖ నాశ్రయిస్తున్నాను.

అవునూ, మరీ అంత చిన్న లెటర్ రాశావేం? ఇంకాస్త పెద్దది రాస్తే నీ సొమ్మేం పోతుంది? నీ లేఖన మృదుల స్పర్శ నన్నెంతో సేదదీర్చింది. నీలాంటి ఫ్రెండ్ ఒక్కరు చాలు. స్త్రీపురుషుల స్నేహానికి సరైన, పవిత్రమైన నిర్వచనం నువ్వే ఇవ్వగలుగుతావు. నీలాంటి ఒక్కరుంటే జీవిత పారమార్థ్యం తీరదూ? ఈ కాగితాలకు, వస్తు సంచయానికి అతీతంగా మన స్నేహం ఉండాలి.

ఇంక వానాకాలం వచ్చేసింది. వర్షాకాలంలో పూసే పూలదే అందం. బంగారు పసుపు తంగేడులు ఎంత బాగుంటాయో! సిరి కాంచనాలు, బాట మల్లెలు విరగబూస్తాయి.

రాత్రి పూసి తెల్లారి రాశిగా రాలే బాట మల్లెల్ని చూడ్డం కోసమే మార్నింగ్ వాక్ చేస్తున్నా. అవి పూసినన్నాళ్ళూ బాట పొడవునా సువాసనలే! ఈ పూల మధ్య నేనూ పూవునై బతికా. ఇప్పుడంతా మారిపోయింది. *గయే ఓడిన్, ఓడిన్ చలాగయా. కాంటే రహే గయే! కాంటోంకా జిక్ర్ రహాగయా! ఉస్ కే సాయా రహాగయా!* ఇపుడెందుకో జ్ఞాపకం వచ్చి రాస్తున్నా.

మనసు బాగాలేదు ప్రజ్ఞా. వెళ్ళి వెళ్ళి ఎక్కడో కొండ లోయల్లో, అడవుల్లో విహరిస్తోంది. మంచు కొండల జారుడు అంచుల్లో తేలుతున్నాను. మనసును ఉల్లాసపరచడానికి, ఒత్తిడి పోగొట్టడానికి ఇలాంటి ఆలోచనలు అవసరం.

కారు మబ్బులు అబ్బురపాటుతో తొందర తొందరగా కదుల్తున్నాయి. బిర్లా టెంపుల్, ప్లానిటోరియం రెండు కొండల మీదా ప్రకృతి కాంత ఎదమీద గాలికి అల్లల్లాడే సన్నని షిఫాన్ ఓణీలా మబ్బులు! నిన్న ట్యాంక్‌బండ్ నిండుగా పొంగుతున్న హుసేన్ సాగర్ నీటి అలల్ని చూస్తూ చాలాసేపు కూర్చున్నా.

నువ్వు బేవఫావి. పదేపదే అనుకుని ఏం లాభం. నీ నీలి కురుల్లోంచి జారిన మల్లెను తీసి నా డైరీలో దాచుకున్నా ఎప్పుడో! తెల్లని ఆ మల్లె ఇప్పుడు ఉడ్‌రోజ్‌లా మెరుస్తోంది. ప్రజ్ఞా, మధుర భావాలు ఎంత పరిమళభరితాలో బాట మల్లెల్లా!

నువ్వీ పూలని పున్నాగ అంటావుకదూ! 'పూసింది పూసింది పున్నాగ! పూసంత నవ్వింది నీలాగ...!' నువ్వు కొట్టి పారేస్తావుగానీ, నీకు ఉత్తరం రాస్తున్నా, నీ ఉత్తరం చదువుతున్నా నీతో మాట్లాడినట్లే ఉంటుంది. అందుకే నీతో ఈ స్నేహం, చొరవ, అభిమానం. ఉత్తరంలో హద్దులు మీరుతున్నందుకు కోపంగా ఉందా? మురిపెంగా నవ్వే నీ నవ్వు,

ఈ మహానగరంలో చీకటి దీపాలు వెలుగుతున్నాయి ఒక్కొక్కటిగా. నగరం వెలుగుపూలు పూస్తున్న మహావృక్షంలా ఉంది. మనసుకు, మనసుకు చుట్టరికం హెచ్చితే మనిషికీ మనిషికీ మధ్య రాగబంధం ఏర్పడుతుందన్నమాట ఎంతో నిజం అనిపించింది.

తేనెని, వెన్నెలని రంగరించినట్లు చలితో నిండిన వర్షపు రాత్రి ఆంతర్యపు కుటీరంలో దీపం వెలిగించినట్లయింది లావణ్యను చూశాక. గట్టిగా అలా అనుకోవాలంటే ఓ పక్క భయంగానూ ఉంటుంది. నా జీవితం నాలాంటి వాళ్ళకు గుణపాఠం కావాలి ప్రజ్ఞా. సరైన సమయంలో ధైర్యం చేయలేక ఇందుని దూరం చేసుకున్నాను. ఇందుతో నా చెలిమి, ఇతర స్త్రీలతో సరదాగా మాట్లాడే నా తత్త్వం ఎవరి ద్వారానో విన్న చెప్పుడు మాటల వల్ల మనసు విరిగిన భ్రమర కాళ్ళు పట్టుకున్నా కరగని పాషాణహృదయిని అయిపోయింది. పరస్త్రీల పట్ల హద్దులు దాటని నా ప్రవర్తనారీతుల్ని విడమర్చి చెప్పినా నా నిజాయితీని నమ్మలేదు. మా ఇద్దరి మధ్యా ఇగో ప్రాబ్లమ్స్ లేవు. సుప్రీమసీ ఏక పక్షం. తనదే! ఏ రాగహేలా లేని నా బతుకులో నీ స్నేహమే చలివేంద్రం.

నా ఉన్నతిని చూసి అసూయపడేవాళ్ళు, నా

వైఫల్యాలు చూసి ఆనందించేవాళ్ళు, నా స్థితికి జాలిపడే సానుభూతిపరులు, నోటితో నవ్వి నొసలుతో వెక్కిరించేవాళ్ళు, తిక్క కుదిరిందని తమాషా చూసేవాళ్ళు. వీళ్ళేగా నా చుట్టూ. మగవాడు స్వార్థపరుడనీ, నయవంచకుడనీ ఏమేమో అంటారే! మరి అలాంటి స్త్రీకి బలై పోయిన నన్నేమనుకోవాలి? ఆ స్త్రీనేమనాలి? చెప్పు ప్రజ్ఞా! బతుకును బాగుచేసుకోమని చెప్పడానికి నాకెవరున్నారు? నువ్వొక్కదానివేగా! నిజం చెప్పు. నేను మనిషినేనా? ఏదైనా పుస్తకంలో పాత్రనా? ఎందుకో ఒక్కోసారి నేను నేను కాదనిపిస్తుంది. ఈ ఉనికి, ఈ అస్తిత్వం ఏవీ నాకు పట్టనట్లనిపిస్తుంది. అలా అని మనసూరుకోదు.

కన్నె గులాబీని కన్నెత్తి చూడొద్దని ఆజ్ఞాపించావుగా, ఈ శాపగ్రస్తుడికి వరమీయడానికన్నట్లు కనబడింది లావణ్య. పేరుకి తగినట్లు కాక కాస్త బొద్దుగా, ముద్ద బంతిలా ఉంటుంది. అందరూ పేరుకి తగ్గట్టు ఉంటారా నీలాగ! తానూ, నేను ఒకే పడవ ప్రయాణికులం. బహుశా అందుకే దగ్గరయ్యామేమో! తాను ఎంత ఫాస్టో అంత మాడెస్ట్. ఓ బుక్ ఫెయిర్లో కలిసింది. తెలుగుదనం మా మనసుల్ని కలిపింది. పరిచయం ప్రణయమైంది. తన చొరవే నేను ముందడుగు వేసేలా చేసింది.

కారుమబ్బులు తొలగి నక్షత్ర పుష్పాలు మెరుస్తున్నాయి. నా జీవితంలోని తుపాను తీరం దాటాకా పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. అందాకా కలిసే జీవిస్తాం. ఔట్ డోర్ ఆఫీసు పని ఇంత మనశ్శాంతినెప్పుడూ ఇవ్వలేదు.

వధువును చూడమని నీకు చెప్పి నేనే చూసుకున్నందుకు కోపమా? సంతోషమా? నీ గురించి, ఇందు, భ్రమరల గురించి చెప్పాను. నీ ఉత్తరాలు చూపించాను. నీ అంత మంచి ఫ్రెండ్ నాకున్నందుకు నన్ను చూసి అసూయపడుతున్నానంది. నిన్ను అర్జంటుగా చూడాలని పంతం పట్టి తానూ నాతో వస్తోంది. పెళ్ళి ట్రాష్ అనీ, తాళి, దాంపత్యం పంజరం అనీ, మొగుడు లేకుండానే ఆడాళ్ళు హాయిగా బతగ్గలరనీ వాదాల భ్రమల్లో పరిభ్రమించిన లావణ్య గృహమేకదా స్వర్గసీమ అనే నీ గురించి విని అలా ఉండడం ఎలా సాధ్యమని అడిగింది. నిన్నే అడగమన్నాను.

చీరలు, చొక్కాలు మార్చినట్లు కాకుండా మనసుకి మరులద్దే అనురాగం మా సొంతం చేసుకోవాలనుకుంటున్నాం. నీ స్నేహం సాక్షిగా జీవితాంతం లావణ్యతోనే ఉంటాను నేస్తం. ఈ నిజం చెదిరిపోకూడదని, ఇకపై కలల్లోకి తానే రావాలని కోరుకుంటున్నాను. వాస్తవంలో నిలబడి కలల గురించి ఆలోచిస్తున్నందుకు నవ్వుతున్నావు కదూ! ఏమిటో ఈ పిచ్చి మనసు అమితానందాన్ని తట్టుకోలేక తబ్బిబ్బవుతోంది. ఎపుడెపుడు తన చేయి పట్టుకుని నీ చెంత వాల్తానా! మా అనురాగ కుటీరంలా మేమెపుడు మా రాగనికుంజ్‌కి తోరణాలు కడతామా అని తహతహగా ఉంది.

సంప్రదాయ, అభ్యుదయాల అద్భుత మేలు కలయిక నువ్వు. ఏ స్త్రీ అయినా నీలా ఉండడం అరుదే అనిపిస్తుంది. అమ్మ దగ్గర్నుంచి, అక్కలు, వదినలు దాటి లావణ్య దాకా. కీపిటప్!

మై ఫ్రెండ్, నీలా ఉండడం లావణ్యకు నేర్పించవూ?

ప్రజ్ఞా. అయిదేళ్ళ నరకం తర్వాత నవ్విన నాపచేనై పండబోయే నా భావి జీవనగతికి ఆసరా నీవు, నీ స్నేహమే అన్నమాట మరువకు. లావణ్య వచ్చిందని పరాకు చిత్తగించకు వరాల రాణీ! శ్రీవారికి, చిరంజీవులకు శుభాకాంక్షలు! ఉంటాను. వచ్చీ రాగానే వస్తాను, కాదు వస్తాం. బై ప్రణవ్. (సమాప్తం)

# ఆగ్రహం దగ్గరే ఇంకెన్నాళ్ళు?

## ఆవేదన, ఆగ్రహాల నుంచి ద్వేషం దిశగా సాగిన ప్రయాణం



**మీరేవుట్లా...?**
రచన: మద్దూరి నగేష్‌బాబు
శ్రీజ పబ్లికేషన్స్, 56, వెంకటరెడ్డి నగర్ కాలనీ, నరసరావుపేట–522 601;
పేజీలు: 128.
వెల: రూ. 25/-

పసునూరు శ్రీధర్‌బాబు

ఈ *దేశం ప్రేమనే పదాన్ని అర్థం చేసుకోవాలంటే/ ముందు మనం ద్వేషం నేర్చుకోవాలి* అంటాడు మద్దూరి నగేష్‌బాబు. అగ్రకులస్థుడిని ప్రేమించి మోసపోయిన దళిత విద్యార్థిని సునీత కోసం రాసిన ఈ అక్షరాలు మొత్తంగా అతని కవిత్వ దృక్పథాన్ని కూడా సూచిస్తాయి. దళిత జీవితానుభవాలను సామాజిక ఆగ్రహంగానే కాకుండా, అస్తిత్వ పరివేదనగానూ వినిపించగలిగిన నగేష్‌బాబు ఈ సంకలనంలో ఆవేదన నుంచి ఆగ్రహానికి, ఆగ్రహం నుంచి ద్వేషానికి ప్రయాణించాడు. అణచివేత తీవ్రత తెలిసినవాడు కనుక ఈ కవి శత్రువు మీద అంతే తీవ్రతతో విరుచుకుపడతాడు. ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి బ్రాహ్మణవాదులు పవిత్రీకరించిన ఆచారాల్నీ, చట్టుబండల్నీ వ్యంగ్యాత్మకంగా ధ్వంసం చేస్తూపోతాడు. దళితోద్యమ కవిత్వమంటే అగ్రవర్ణాలను దూషించడమే అనుకునే చాలామంది దళిత కవులకు భిన్నంగా నగేష్‌బాబు దళిత ప్రేమలనీ, ప్రేమానుభవాలనీ వ్యక్తం చేస్తూ దళిత జీవితాన్ని తనలో నుంచి చూపించడంలో సఫలమవుతాడు.

*ప్రతి గాయాన్నీ ఒక ఆర్థిక శాస్త్రంగా చదువుకుని, ప్రతి అవమానాన్నీ ఒక అర్థశాస్త్ర పరీక్షగా పాసైన నేను, ...ఇన్ని యుగాల దోపిడీకి ప్రతి పైసాకీ లెక్కలు అడిగే, ఒక కొత్త జమాబందీని మొదలెడుతున్నాను* (జమాబంది) అంటూ దళిత చైతన్య గీతాన్ని వినిపిస్తున్న నగేష్‌బాబు ఉద్యమం పరిపూర్ణం కావడానికి "ఇక యుద్ధం ఒక నిత్యావసరం పదార్థం" అని ప్రకటిస్తాడు.

కారంచేడు మృతవీరుల్ని సంస్మరిస్తూ జూలై పదిహేడు కవితలో *ఆర్యులు దస్యుల్ని నరికినట్లు దేవతలు రాక్షసుల్ని నరికినట్లు, ఒక ఊరు తన వాడని వరసబెట్టి నరుకుతుంటే, నిరాయుధ మారణ క్షణాల్లో పల్లె మూలిగిన మూలుగు, ఎవరు ఎవరు ఎవరు విన్నారు?, ఒక్క జూలై పదిహేడు తప్ప, ...నిజంగానే ఈరోజు, ఈ విశాల దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గొప్ప రోజు కాకపోవచ్చు, కానీ ఇది మాగాళ్ళలో నిండటం నుండి నా నెత్తురికి మరగటం నేర్పిన రోజు* అంటూ కవిత్వమంతటా యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తాడు. కానీ, చాలా చోట్ల కవిత చివర్లోకి వచ్చేసరికి మన జగమెరిగిన మెజారిటీ విప్లవ కవులకు మల్లే, *చూద్దాం... రేపంటూ ఒకటుందిగా* (చలో హైద్రాబాద్); *ఆరోజు దూరంలో లేదు, ఆ తలారీ ఎవరో కాదు* (తలారి); *నేనిప్పుడో మహాసంగ్రామాన్ని కలగంటున్నాను, నీళ్ళడిగితే నెత్తురిచ్చిన చోట, నెత్తురు తాగటం తప్పదని చెప్పడానికి సాహసిస్తున్నాను* (ఒంటి కంటి కల) అంటూ రొమాంటిసిస్ట్‌గా తేలిపోతాడు. విప్లవకవిత్వంలోని రొమాంటిసిజమ్ రాజ్యానికి నిశ్చింతను ప్రసాదించినట్లుగానే, దళిత కవిత్వంలోని ఈ ధోరణి బ్రాహ్మణవాదులకు ఉపయోగపడే ప్రమాదం ఉంది. దీనికి తోడు నగేష్‌బాబు తన వ్యంగ్య కవితా వ్యక్తీకరణలో చాలాచోట్ల హేళనకు, దూషణకు తేడా తెలియకుండా ప్రవర్తిస్తాడు(ఇతి వార్తాహ).

ఇంకా ఈ పుస్తకానికి శీర్షికనిచ్చిన మీరేవుట్లా కవిత, *మా కులమేందో తెలియకపోతే మీకు తిన్నది అరగదా?, మా పుటకేందో తెలుసుకోకపోతే మీ తూరుపు తెల్లారదా?* అంటూ అగ్రకుల భావనను ఎద్దేవా చేస్తూ సాగుతుంది. కానీ, చివరి భాగానికి వచ్చేసరికి కవి, *మేం మాలాన్మి – పప్పు వాసన కొట్టం..., మేం బీసీన్మి – మా ఇళ్ళనొదిలి వ్యభిచారాలు చేయం* అంటూ సెన్సేషన్ స్థాయికి జారిపోతాడు.

నిజానికి తనకు శత్రువు మీద వైరమేమీ లేదని, కులవివక్ష మీదే తన కసి అని దళిత కవి స్పష్టం చేసి ఉండాల్సింది. దళితులు పైకి వస్తే తాము చీలిపోతామేమోననే భయం లాంటి అజ్ఞానం నుంచి అగ్రవర్ణాలను విముక్తం చేసి ఉండాల్సింది. ఈ విషయంలో అడుగు ముందుకు వేయక పోగా, *ఎక్కడ్నుంచో వచ్చిన ఆర్య అనాగరికులారా, ఇకనైనా ఆ ఏవుట్లున్న పదాన్ని మర్చిపొండి లేదో... మళ్ళీ మీకు ఆసియా మైనర్ దారి చూపిస్తాం* అని రాసే ఆవేశం, తెలుగు దళిత కవితకు పట్టిన గ్రహణంగానే భావించాలి.

> *ఏం కావాలి? నువ్వు కావాలి/ నీ గుండెలో నాకు చోటు కావాలి/ నీ ఇంట్లో నేను చెయ్యి కడగాలి/ నా గుడిసెకొచ్చి నువ్వు పిల్లనడగాలి/ మనం చుట్టాలం కావాలి/*
> – పుట 61

ఇక్కడ మనం, 'సమాజవాదాన్ని ఒక ఆదర్శం మాదిరిగానే కాకుండా, దుఃఖంతో కుమిలిపోయే ఒక ఆత్మవేదనగా కూడా రూపొందించాల'ని చెప్పిన రామ్‌మనోహర్ లోహియానోసారి స్మరించుకుందాం: "బ్రాహ్మలపై కక్ష సాధించాలని, వారిని అధిగమించాలనే భావనతో కొందరు పనిచేస్తూ ఉండవచ్చు. అది సరైనదీ కాదు. సాధ్యమయ్యేదీ కాదు. ఇటువంటి మనస్తత్వాన్ని పెంపొందించినట్లయితే దళితులలో ముఖస్తుతి చేయడం అలవాటైన వారూ, ద్వేషాగ్నిని ఉపయోగించుకునే ప్రత్యేక సామర్థ్యం ఉన్నవారు మాత్రమే పైకి రావడానికి ఆస్కారం ఉంటుంది." ఇవేవీ చూసుకోకుండా శత్రువును హడలెత్తించే కవిత్వం రాస్తున్నామని దళితకవులు మురిసిపోతే దానివల్ల దళితోద్యమానికే విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదం ఇప్పటికే మొదలైందేమో కూడా దళిత కవులు చెక్ చేసుకోవాలి. ■